కథ

# శిక్ష

సి.ఎస్. చంద్రశేఖర్

**విజయవాడ బస్‌స్టేషన్‌లో నిలబడి ఉన్నారు జయశ్రీ, ఆమె భర్త మౌళి. మౌళి చెల్లెలి గృహప్రవేశం ఫంక్షన్‌కు తిరుపతి నుంచి వచ్చారు యిద్దరూ. మరుసటిరోజు మౌళి ఆఫీసుకు తప్పనిసరిగా వెళ్ళవలసి ఉండటంతో రాత్రి భోజనాలయ్యాక తమ ఊరికి బయలుదేరారు.**

పది గంటలకు రామచంద్రాపురం నుంచి తిరుపతి వెళ్ళే బస్సు స్టేషన్‌లో ప్రవేశించింది. బస్సు నిండా జనం ఉన్నారు. బస్సు ఎక్కడానికి మౌళి దంపతులతోపాటు మరో పదిమంది ఉన్నారు.

"సీటు లేనట్లుంది. ఇంకో బస్సులో వెళదాం" అంది జయశ్రీ.

"ఇలా అనుకొంటూ ఉంటే తెల్లారిపోతుంది. పెళ్ళిళ్ళ సీజను కాబట్టి అన్ని బస్సుల్లో యిలాగే ఉంటుంది పరిస్థితి. రేపు నేను ఆఫీసుకు వెళ్ళాలని చెప్పాగా. ఎక్కు" అంటూ భార్యను తొందరపెట్టాడు మౌళి.

బస్సులో యిద్దరూ నిలబడ్డారు. అట్టే ఆలస్యం చెయ్యకుండా బస్సు స్టార్టు చేశాడు డ్రైవరు. మౌళి టికెట్లు కొన్నాడు. చల్లని గాలికి నిద్ర రాసాగింది యిద్దరికీ. 'ఎక్కడైనా కాస్త కూర్చోవడానికి చోటు దొరికితే బాగుణ్ను. నిద్రలో పడితే తెల్లారేసరికి తిరుపతి వచ్చేస్తుంది' అనుకొన్నాడు మౌళి.

బస్సు గుంటూరులో ఆగింది. చాలామంది దిగిపోయారు. జయశ్రీకి ఓ ముసలావిడ ప్రక్కన సీటు దొరికింది. ఆనందంగా కూర్చొని భర్తవైపు చూసింది. మౌళి ఆమెనే చూస్తున్నాడు. జాలిగా భర్తవైపు చూసింది. ఫర్వాలేదన్నట్టు చూశాడు మౌళి. బస్సు కదలగానే నిలబడే నిద్రపోసాగాడు.

చిలకలూరిపేటలో మరికొంతమంది దిగారు. తన ప్రక్కన ఉన్న 'టూ సీటర్' ఖాళీ అవడంతో గబుక్కున కూర్చున్నాడు మౌళి. అంతే వేగంగా ఓ అమ్మాయి కూడా అదే సమయంలో ఆ సీట్లోనే కూర్చుంది. మొదట కంగారుపడ్డా తర్వాత సర్దుకొని కూర్చున్నారు పక్క పక్కనే.

లైట్లు ఆర్పేశాడు కండక్టరు. చీకటిలోనే తన ప్రక్కన కూర్చున్న అమ్మాయిని పరిశీలించాడు మౌళి. ఇరవై ఏళ్ళుంటాయి ఆ అమ్మాయికి. కాలేజీ చదివే అమ్మాయి అయి ఉంటుందని అనుకొన్నాడు. ఆ అమ్మాయి కళ్ళు చీకట్లో మెరుస్తున్నాయి. చుడీదార్ ధరించి ఉంది. కుడి చేతికి గాజులు, ఎడమ చేతికి చిన్న వాచీ ఉంది. 'అందగత్తెకాదుగాని మరీ తీసిపారేసేలా లేదు' అనుకొన్నాడు మౌళి.

ప్రక్కన వయసులో ఉన్న ఆడపిల్ల ఉండేసరికి అతని నిద్ర మాయమైంది. అయినా నిద్రపోతున్న వాడివలే నటిస్తూ తన చేతిని ఆమె చేతిపై వేశాడు. ఆమె నుంచి ఎటువంటి రియాక్షనూ లేకపోయేసరికి కొద్దిక్షణాల తర్వాత తన తలను ఆమె భుజాల మీద ఆన్చాడు. ఆమె నుంచి ఎటువంటి ప్రతిఘటనా ఎదురవ్వలేదు. కొద్దిసేపటి తర్వాత తన ఎడం చేతిని ఆమె భుజంపై వేసి మెల్లగా క్రిందకు జరిపాడు.

ఆమె అతని చేతుల్ని పట్టుకొంది మృదువుగా. అతని చేతిలో తన చేతిని ఉంచి, అతని చేతిని తన బుగ్గలకు రాసుకొంది సుతారంగా.

మౌళికి ఆమె భావం అర్థమైంది. అతనిలో ఆనందం ఉరకలేసింది. వెంటనే విజృంభించాడు తన టాలెంట్ ప్రదర్శిస్తూ.

* * *

"మీరు నిద్రపోరా యీ రాత్రి" రాత్రి ఒంటిగంటప్పుడు అడిగింది ఆ అమ్మాయి.

"ఉదయం అయిదు గంటలకు వెలుతురు వచ్చేస్తుంది. బస్సులో అందరూ నిద్ర లేస్తారు. అందువల్ల అయిదు గంటల నుండి నిద్రపోతాను. అంతవరకు నో స్లీప్ నో రెస్ట్" అన్నాడు మౌళి.

ఉదయం ఏడు గంటలకు రేణిగుంటలో ఆగింది బస్సు. మౌళి నిద్రలేచి బయటకు చూశాడు.

తర్వాత "మీ యింటికి ఫోనుందా?" అని అడిగాడు ఆమెని.

"ఇల్లు కాదు హాస్టల్"

"ఏ హాస్టల్?"

చెప్పింది ఆ అమ్మాయి తర్వాత "హాస్టల్‌కు కూడా వస్తారా?" అని అడిగింది నవ్వుతూ.

"తప్పకుండా వస్తాను. టిఫినేగా అయింది. భోజనం కూడా చెయ్యాలిగా"

"ఫోన్ చేసి రండి" అంటూ ఫోన్ నెంబరు యిచ్చింది.

"మీ పేరు?"

"నీలిమ. మీ పేరు?"

"రాజేష్." అన్నాడు మౌళి.

"బై. మళ్ళీ కలుద్దాం" లేచి నిలబడుతూ అన్నాడు బస్సు తిరుపతి బస్‌స్టేషన్‌లో ప్రవేశించడంతో.

* * *

"బాగా నిద్రపట్టిందా?" భార్య చేతి నుండి బ్యాగు అందుకొంటూ అడిగాడు మౌళి.

"లేదు. వినోద్ నిద్రే పోనివ్వలేదు" అంది జయశ్రీ.

"వినోద్ ఎవరు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అరె..మీకు వినోద్‌ని పరిచయం చెయ్యలేదు కదూ" అంటూ వెనక్కు తిరిగి బస్సు దగ్గరికి వెళ్ళి లోపలికి చూసింది. మళ్ళీ తిరిగి మౌళి దగ్గరకు వచ్చి "వెళ్ళిపోయినట్లున్నాడు. అయినా రేపు మన యింటికి వస్తానన్నాడు. అప్పుడు పరిచయం చేస్తాను. వాళ్ళిల్లు మన యింటి దగ్గరే" అంది జయశ్రీ.

"ఇంతకూ వినోద్ ఎవరు?" అసహనంగా ప్రశ్నించాడు మౌళి.

"బస్సులో నా ప్రక్క సీట్లో కూర్చున్నతని పేరు వినోద్. రాత్రంతా తను నిద్రపోలేదు. నన్ను నిద్రపోనివ్వలేదు" ముసిముసిగా నవ్వుతూ అంది.

"నీ పక్కన కూర్చున్నది ఓ ముసలావిడ కదా?" అనుమానంగా అడిగాడు.

"మొదట ముసలావిడే కూర్చున్నది. తర్వాత తనకు యిరుకుగా ఉందని వినోద్‌ని నా ప్రక్కన పంపించి తను త్రీసీటర్లో కూర్చుంది"

మౌళి ఏం మాట్లాడలేదు. తన భార్య అలా పరాయి వ్యక్తి పక్కన కూర్చోవడం అతనికి నచ్చలేదు. పైగా అతని కంపెనీ ఆమె ఎంజాయ్ చెయ్యడం యింకా నచ్చలేదు. ఇల్లు చేరేంతవరకూ ఆమెతో మాట్లాడకుండా సీరియస్‌గా ఉండిపోయాడు మౌళి.

* * *

సాయంత్రం ఆఫీసు నుండి యింటికొచ్చిన మౌళికి గులాబ్‌జామ్ స్వీటును కప్పులో అందించింది జయశ్రీ.

"ఏమిటి విశేషం?" అన్నాడు కప్పు అందుకొంటూ.

"ఈరోజు వినోద్ మన యింటికి వస్తాడని చెప్పాను. గుర్తులేదా?"

మౌళి ముఖం నల్లబడింది.

"బస్సులో పరిచయమయితే యింటికి పిలవడమేనా? అతనెవరో, ఎలాంటివాడో తెలుసుకోకుండా స్నేహం చేయడం అంత మంచిది కాదు"

"వినోద్ మంచివాడండీ. లేకుంటే నేను మాత్రం యింటికి పిలుస్తానా?" ముఖం చిన్నబుచ్చుకుంటూ అంది జయశ్రీ.

"సరే. నీ యిష్టం. నేను ఆఫీసు వరకూ వెళ్ళొస్తాను" అంటూ లేచాడు మౌళి.

"అదేమిటి ఇప్పుడేగా ఆఫీసునుంచి వచ్చారు? పైగా వినోద్ వస్తూంటే మీరు యింట్లో లేకుండా ఏం బాగుం

టుంది?''

"'ఏం ఫర్వాలేదు. ఇన్స్పెక్షన్ వస్తూంది. కొంత పని మిగిలి ఉంది, రమ్మని బాసు పిలిచాడు'' అంటూ చెప్పు లేసుకుని బయటకు నడిచాడు మౌళి.

★ ★ ★

కాలింగ్ బెల్ శబ్దం విని తలుపు తెరచిన జయశ్రీ ఎదురుగా కనిపించిన మౌళిని చూసి ఆశ్చర్యపోయింది.

"అదేమిటి ఆఫీసుకు వెళ్ళలేదా?'' అని అడిగింది.

"బాసు భార్య అర్జంటుగా యింటికి రమ్మని ఫోన్ చేసిందట. ఆయన వెళ్ళిపోయారు. నేనొక్కడ్నే ఏం చేయాలని వచ్చేశాను. వినోద్ రాలేదా?'' ఇంట్లోకి చూస్తూ అడిగాడు.

"ఇంకా రాలేదు. వచ్చే సమయం అయింది'' గోడ గడియారం వైపు చూస్తూ అంది.

"నేను కాసేపు పడుకొంటాను. అలసటగా ఉంది. అతనొస్తే నన్ను లేపకు. ఇంకోరోజు మాట్లాడతాను'' అంటూ బెడ్రూంలోకి వెళ్ళాడు.

కొంతసేపటికి కాలింగ్ బెల్ మ్రోగడం, హాల్లో జయశ్రీ మాటలు అతనికి వినిపించాయి. కావాలని లేవలేదు అతను. పది నిమిషాల తర్వాత లేచి హాల్లోకి వచ్చాడు. సోఫాలో ఓ ముసలావిడ పేపరు చదువుతూ కూర్చుని ఉంది. ఆవిడని బస్సులో చూసినట్లు జ్ఞాపకం వచ్చింది అతనికి.

మౌళిని చూడగానే లేచి నిలబడి "నమస్కారం'' అంది.

"నమస్తే. జయ ఎక్కడ'' అన్నాడు.

"గది లోపల వినోద్‌తో ఉంది''

వంట గది ప్రక్కన ఉన్న ఆ గది తలుపు వేసి ఉంది.

మౌళికి ఒళ్ళు మండింది. 'తలుపు వేసుకోవాల్సిన అవసరమేమిటి? కొంపదీసి ఈ ముసలావిడ బ్రోకర్ కాదు కదా' అనుకుంటూ డోర్ హాండిల్ మీద చెయ్యి వేసి వేగంగా తలుపు తెరిచాడు.

ఎదురుగా జయశ్రీ, ఆమె ప్రక్కన పదేళ్ళ పిల్లవాడు. ఆమె పిల్లల కామిక్స్ అతనికి చూపుతోంది.

మౌళిని చూడగానే- "వీడేనండీ వినోద్. అంకుల్‌కు నమస్తే చెప్పు'' అంది జయశ్రీ.

"నమస్తే అంకుల్'' లేచి నిలబడి అన్నాడు వినోద్.

"కూర్చో'' అంటూ తన గదిలోకి వచ్చి కూర్చున్నాడు. అతనిలో అలజడి తగ్గింది. 'తను అనవసరంగా జయను అనుమానించాడు. ఆమె అటువంటి మనిషి కాదని తెలుసు. అయినా ఎందుకో అనుమానం వచ్చింది. పాపం పిల్లలు లేని తనకు ముద్దుగా కనిపిస్తున్న వినోద్‌ను చూడగానే అభిమానం పెంచుకొన్నట్లుంది. అందుకే యింటికి రమ్మని పిలిచింది. తను అనుమానించినట్లు జయకు తెలిసి ఉండదు. తెలిసుంటే అంత ప్రసన్నంగా, నవ్వుతూ మాట్లాడేది కాదు' అనుకొన్నాడు మౌళి.

ఆరోజు రాత్రి భోజనాలయ్యాక అతనికి వక్కపొడి అందిస్తూ "ఎలా ఉంది నా స్క్రీన్ ప్లే'' అంది జయ.



అర్థం కానట్లు చూశాడు మౌళి.

"వినోద్ గురించి మీకు చెప్పి, వాడ్ని యింటికి పిలిచి గది తలుపులు మూసి ఉంచి, మీకు నా మీద అనుమానం వచ్చే విధంగా మాట్లాడి, నటించి, ఓహ్.. అద్భుతంగా ఉంది కదూ. మీ నటన కూడా సుపర్బ్. సాయంత్రం కావాలని ఆఫీసుకు వెళ్ళడం, వినోద్‌తో నేనేం చేస్తూంటానో అనే కుతూహలంతో వెంటనే వచ్చేయడం, బాస్ వెళ్ళిపోయాడని చెప్పడం, కావాలనే నిద్ర నటించి తర్వాత లేచి వచ్చి గది తలుపు తెరవడం-మీరూ చాలా బాగా నటించారు. నా స్క్రీన్‌ప్లేలో ఉన్నట్లే నటించారు''

"ఏమిటి నీ అర్థం లేని వాగుడు. నీవు ఊహించినట్లు నేనేం నిన్ను అనుమానించలేదు. అనుమానించి ఉంటే అప్పుడే నీ చెంప పగలగొట్టి ఉండేవాణ్ణి.''

"అలా అయితే ముందు నేను మీ చెంప పగలగొట్టాలి. ఎందుకో తెలుసా? బస్సులో ఓ పరాయి ఆడదానితో వెకిలిగా, లేకిగా ప్రవర్తించినందుకు? నాకెలా తెలిసిందనుకొంటున్నారా? రాత్రి నిద్రరాక తలనొప్పితో బాధపడుతూ మీ సీటు దగ్గరికి వచ్చాను. మీరు చేస్తున్నదేమిటో ఆ చీకట్లో కూడా నాకు కనబడింది. ఏం మనుషులండీ మీరు? మీకు సిగ్గెయ్యటం లేదూ? మీకంటే వయసులో ఎంతో చిన్నదైన ఆ అమ్మాయిలో ఓ చెల్లెలు మీకు కనబడలేదూ? ఆ అమ్మాయి బుద్ధి అటువంటిదే కావచ్చు. చదువుకొని ఉద్యోగం చేస్తున్న మీ సంస్కారం ఏమైంది? మీ బుద్ధి ఇలాంటిదని తెలిస్తే నా మనసు ఎంత గాయపడుతుందో మీకు తెలియదూ?''

మౌనంగా వింటూండిపోయాడు మౌళి.

"మీరు అనైతికంగా ప్రవర్తించినా నా ప్రక్కన ఓ మగాడు కూర్చున్నాడని తెలియగానే మీలో అలజడి మొదలైంది. కనీసం అప్పుడైనా మీరు చేసిన తప్పు గురించి పశ్చాత్తాప పడలేదు. నేను తప్పు చేస్తున్నానన్న అనుమానమే మీలో ఉండింది. మీరు చేసిన తప్పే నేను చేసి ఉంటానని అనుకొన్నారు. అది తెలుసుకోవాలని నానా తంటాలు పడ్డారు. మగవాళ్ళు కాబట్టి మీరు చేస్తే తప్పుకాదు. అదే నేను చేస్తే తప్పు. చెంపలు పగలగొట్టడానికి కూడా సిద్ధమయ్యేవారు.

కానీ నాకు సంస్కారం ఉంది. అటువంటి ఆలోచనలు కూడా రావు నాకు. కాబట్టి మీరు ఆ విషయంలో నిశ్చింతగా ఉండండి. ఇకపోతే కళంకితమైన మీ చేతులు నన్ను తాకడానికి వీల్లేదు. ఈరోజు నుండి నన్ను తాకకండి. ఇదే నేను మీకు విధించే శిక్ష'' అంటూ గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది జయశ్రీ.

తప్పు చేసినందుకు, భార్య మనసును గాయపరచినందుకు పశ్చాత్తాపపడుతూ నిల్చుండిపోయాడు మౌళి.